సంపుటి :02 సంచిక :248 పేజీలు :05 వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com Voice of the people

## ఇద్దరు మావోయిస్టుల

# సరెండర్

వివరాలు వెల్లడించిన ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్

03




బుధవారం 10, డిసెంబర్ 2025




# రేపే ఓట్ల పండుగ

## ఉమ్మడి జిల్లాలో పంచాయతీ ఎన్నికల కోలాహలం

- వలస వెళ్లిన వారంతా ఓటేసేందుకు స్వస్థలాలకు..
- మొదటి విడత పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి
- బ్యాలెట్ బాక్సులతో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది
- ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఓటింగ్
- మధ్యాహ్నం 2 గంటల తర్వాత ఓట్ల లెక్కింపు.. ఫలితాల వెల్లడి
- ఉప సర్పంచ్ ఎన్నిక కూడా..

04

ఉమ్మడి వరంగల్ జిల్లాలో రేపే మొదటి పంచాయతీ ఎన్నికలు జరుగ నున్నాయి. ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభం కానున్నది. మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ కేంద్రంలో ఉన్నవారికి ఓటు వేసే అవకాశం ఉంటుంది. పోలింగ్ నేపథ్యంలో బుధవారం సాయంత్రమే పోలింగ్ అధికారులు, సిబ్బంది బ్యాలెట్ బాక్సులు, పత్రాలు, సామాగ్రితో ప్రత్యేక వాహనాల్లో తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. మొదటి విడతలో గురువారం భూపాలపల్లి జిల్లాలో నాలుగు మండలాలు, హనుమకొండ జిల్లాలో మూడు మండలాలు, జనగామ జిల్లాలోని ఐదు మండలాలు, మహబూబాబాద్ జిల్లాలోని ఐదు మండలాలు, ములుగు జిల్లాలోని మూడు మండలాలు, వరంగల్ జిల్లాలోని మూడు మండలాల్లో ఎన్నికలు జరుగనున్నాయి. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. పల్లెవీడిన వారంతా ఓటు వేసేందుకు ఇక మళ్లీ స్వస్థలాలకు చేరుకుంటున్నారు. —అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి

## 2వేల మందితో బందోబస్తు

- ప్రతి మండలానికి ఇన్చార్జిగా ఒక ఏసీపీ స్థాయి అధికారి
- ప్రతి పోలింగ్ కేంద్రంలో ఎస్సై లేదా ఏఎస్ఐ, ఇతర పోలీసులు
- పంచాయితీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ

02



## ఎంతైనా పర్లే.. గెల్సుడే లెక్క!

- పల్లె పల్లెనా ప్రలోభాల పర్వం
- తెల్లవారితే మొదటి విడత పోలింగ్
- నిన్నమొన్నటివరకు ప్రచారానికి దూరంగా ఉన్న వారు కూడ రంగంలోకి..
- ఎస్సీ, ఎస్టీ రిజర్వ్ స్థానాల్లో ఓటుకు రూ.500 వరకు పంపిణీ
- జనరల్ స్థానాల్లో రూ.వెయ్యి నుంచి గరిష్ఠంగా రూ. 3 వేల వరకు..
- వలస వెళ్లిన వారికి అభ్యర్థుల ఆఫర్లు
- ఏరులై పారుతున్న మద్యం.. ఇంటింటికీ క్వార్టర్లు
- ఇదే సరైన సమయమని భావించి బ్రాండెడ్ మద్యం కోరుతున్న మద్యం ప్రియులు

04



## తడి చెత్త నుంచి ఎరువు

- తయారీని ప్రోత్సహించాలన్న బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్
- 39,40 డివిజన్లలో తడి పొడి చెత్త అందజేత పరిశీలన

04



# అభివృద్ధికి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి

## ఎమ్మెల్యే జీఎస్సార్

### అటవీ గ్రామాల్లో జోరుగా ఎన్నికల ప్రచారం



భూపాలపల్లి, అక్షర దర్బార్: గ్రామాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను గెలిపించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు (జీఎస్సార్) కోరారు. బుధవారం ఉదయం భూపాలపల్లి మండలంలోని అటవీ గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్‌తో కలిసి నాగారం, ఆజంనగర్, నందిగామ, దీక్షకుంట, పంబాపూర్, దూదేకులపల్లి గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పబ్లిక్ కార్నర్ మీటింగ్‌లలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలోనే అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసిందని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలే పాలకులని, ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

# పాలంపేటలో గులాబీ జోరు

- 'అభివృద్ధికి కృషి చేస్తా'
- ఉంగరం గుర్తుకు ఓటేయాలని బీఆర్ఎస్ అభ్యర్థి చల్లగొండ రాజు



వెంకటాపూర్, అక్షర దర్బార్: వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామంలో గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారం రోజురోజుకీ హోరెత్తిస్తూ బీఆర్ఎస్ పార్టీ జోరు అందుకుంది. బీఆర్ఎస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి చల్లగొండ రాజు తన ఎన్నికల గుర్తు అయిన ఉంగరానికి ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తూ ప్రచారంలో దూసుకుపోతున్నారు. సర్పంచ్‌గా లేని రోజుల్లోనూ గ్రామాభివృద్ధికి, సహాయ సహకారాలకు కృషి చేశానని రాజు పేర్కొన్నారు. సర్పంచ్‌గా గెలిపిస్తే గ్రామంలో అనేక అభివృద్ధి పనులు చేపడతానని, సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఆర్ అండ్ బి నిధులతో నాలుగు లైన్ల రోడ్డు, సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. గ్రామంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడే అభివృద్ధి జరిగిందని, కాంగ్రెస్ రెండేళ్ల కాలంలో ఏం అభివృద్ధి చేసిందో చూపించాలని ఆయన ప్రశ్నించారు. ప్రజల గుండెల్లో కేసీఆర్ చిరస్థాయిగా నిలిచిపోయారని, ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, అభివృద్ధి కోసం నిత్యం పోరాడుతానని చల్లగొండ రాజు ధీమా వ్యక్తం చేశారు.



# 2వేల మందితో బందోబస్తు

- ప్రతి మండలానికి ఇన్చార్జిగా ఒక ఏసీపీ స్థాయి అధికారి
- ప్రతి పోలింగ్ కేంద్రంలో ఎస్సై లేదా ఏఎస్ఐ, ఇతర పోలీసులు
- పంచాయితీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్





అక్షరదర్బార్, హనుమకొండ: మొదటి విడత పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ వెల్లడించారు. గురువారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వివిధ మండలాల్లో జరిగే మొదట విడత గ్రామ పంచాయితీ ఎన్నికల బందోబస్తు నిర్వహణ కోసం 2వేల మందికిపైగా పోలీసులను వినియోగించడం జరుగుతోందని ఆయన తెలిపారు. వీరిలో ముగ్గురు డీసీపీలు, ఐదుగురు అదనపు డీసీపీలతో పాటు ఏసీపీలు 13, ఇన్స్పెక్టర్లు,28, ఎస్ఐలు 122, ఏఎస్ఐ/హెడ్ కానిస్టేబుళ్ళు 412, కానిస్టేబుళ్ళు 1154, హోంగార్డ్స్ 285 మంది, వీరితో పాటు డిస్ట్రిక్ట్ గార్డ్స్, బాంబ్ డిస్పోజబుల్ విభాగాలకు చెందిన సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని సీపీ పేర్కొన్నారు. ఎన్నిక వేళ అదనపు డీసీపీ స్థాయి పర్యవేక్షణలో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ నియమించడం జరిగిందని, ఎన్నికలు జరిగే ప్రతి మండలానికి ఒక ఏసీపీ స్థాయి అధికారి ఇంచార్జ్‌గా వుంటారని, రూటు మొబైల్స్ టీంలు, షాడో పార్టీలు, ప్రతి పోలింగ్ కేంద్రంలో ఒక ఎస్ఐ/ఏఎస్ఐతో పాటు హెడ్ కానిస్టేబుళ్ళు, కానిస్టేబుళ్ళు, హోంగార్డులు విధులు నిర్వహిస్తారని సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. ఓట్ల లెక్కింపు సమయంలో పోలింగ్ కేంద్రం వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు మొబైల్ పార్టీలు నిరంతరం పెట్రోలింగ్ పోలీస్ బృందాలు పెట్రోలింగ్ నిర్వహిస్తారని పోలీస్ కమిషనర్ వెల్లడించారు.

### - 156 తుపాకుల స్వాధీనం

ఎన్నిక నియామావళి అమలు నాటి నుంచి వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మొత్తం చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించడం జరిగిందని, అలాగే గ్రామాల్లోనూ ముమ్మరంగా తనిఖీ నిర్వహించడం ద్వారా నేటి వరకు రూ.6.04 లక్షలతో పాటు,120 కేసుల్లో సుమారు రూ.10.69 లక్షల విలువ గల మద్యం సీసాలు, 46కేసుల్లో రూ.1.19 లక్షల విలువగల 322 లీటర్ల గుడుంబా, రూ.లక్ష విలువ గల గంజాయిని పోలీసులు వివిధ ప్రాంతాల్లో స్వాధీనం చేసుకోవడం జరిగిందని సీపీ వివరించారు. ఎన్నిక సందర్భంగా లైసెన్స్ కలిగి వున్న మొత్తం 156 తుపాకులను స్వాధీనం చేసుకోవడంతో పాటు, గతంలో ఎన్నికల్లో గొడవలకు పాల్పడిన వ్యక్తులు రౌడీ షీటర్లు, అనుమానస్పద వ్యక్తులకు సంబంధించి 384 కేసుల్లో మొత్తం 2,205 మందిని బైండోవర్ చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల వేళ ఎవరైన ఎన్నికలకు విఘాతం కలిగించే విధంగా ఎలాంటి చర్యలకు పాల్పడినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఇలాంటి చర్యలకు ఎవరైన పాల్పడుతున్నట్లు సమచారం అందితే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రజలకు సూచించారు.

# ఊరంటే నాకు ప్రాణం..

- మీ ఆశీర్వాదమే నా విజయం..
- వెంకటేశ్వర్ల పల్లి సర్పంచ్ అభ్యర్థి పెండ్యాల మహేందర్ రెడ్డి.



అక్షరదర్బార్, పరకాల: వెంకటేశ్వర్ల పల్లి గ్రామంలో స్థానిక ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ మద్దతు సర్పంచ్ అభ్యర్థి పెండ్యాల మహేందర్ రెడ్డి ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేపట్టారు. "ఊరంటే నాకు ప్రాణం... మీ ఆశీర్వాదమే నా విజయం" అని గ్రామస్తులను కోరుతున్న ఆయన, చిన్నప్పటి నుంచీ పెరిగిన ఊరికి సేవ చేయడమే తన ధ్యేయమని భావోద్వేగంగా తెలిపారు. గ్రామ అభివృద్ధే లక్ష్యంగా ఎల్లప్పుడూ ప్రజల మధ్యే ఉంటూ సేవ చేస్తున్నానని గుర్తుచేసిన మహేందర్ రెడ్డి, "మీ ఇంట్లో ఒక అన్నగా, తమ్ముడిగా నన్ను ఆశీర్వదించండి. కత్తెర గుర్తుకు మీ అమూల్యమైన ఓటును వేయండి" అని అపీలు చేశారు. గ్రామ ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉంటూ, గ్రామ అభివృద్ధి పనులకు నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామస్తులందరూ ఐక్యంగా నిలిచి కత్తెర గుర్తుకు మద్దతు తెలపాలని కోరారు.

# కాంగ్రెస్ గెలుపునకు కుడా చైర్మన్ ఇనగాల ప్రచారం

- ఆత్మకూరు, పరకాల మండలాల్లో పర్యటన..
- గ్రామ సమస్యల పరిష్కారానికి హామీ



అక్షరదర్బార్, పరకాల: వరంగల్ కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థుల గెలుపు కోసం ఆయన ఆత్మకూరు, పరకాల మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. ఆత్మకూరు మండలంలోని నీరుకుళ్ళ గ్రామంలో సర్పంచ్ అభ్యర్థి నీలం విజయలక్ష్మి–రాజుకు మద్దతుగా, అలాగే పెంచికలపేటలో పార్టీ అభ్యర్థుల విజయానికి మద్దతుగా ఆయన ప్రచారం చేసి ఓటర్లను ఆశీర్వదించాలని కోరారు. పరకాల మండలంలోని పోచారం గ్రామంలో అభ్యర్థి పెంతల మధుకర్ విజయం కోసం ప్రచారం చేసి, స్థానిక సమస్యల పరిష్కారం కోసం పార్టీ ఇచ్చిన హామీలను ప్రజలకు వివరించారు. వెల్లంపల్లిలోనూ పార్టీ అభ్యర్థికి అనుకూలంగా ఇంటింటా ప్రచారం చేశారు. అనంతరం పెద్దాపురం గ్రామానికి వెళ్లిన ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, ఇటీవల మరణించిన గ్రామస్తుడు ముస్కు లక్ష్మయ్య పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

# కేంద్రంతోనే గ్రామ పంచాయతీల అభివృద్ధి
## రాణా ప్రతాప్ రెడ్డి

### బీజేపీ బలపరిచిన అభ్యర్థి వీరన్నకు మద్దతుగా ఇంటింటి ప్రచారం



అక్షర దర్బార్, నల్లబెల్లి: గ్రామ పంచాయతీల అభివృద్ధి కేవలం కేంద్ర ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం నర్సంపేట నియోజకవర్గం, ఆసరవెల్లి గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. బీజేపీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి బానోతు వీరన్న గెలుపు కోసం రాణా ప్రతాప్ రెడ్డి ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. ప్రజలతో మాట్లాడి గ్రామంలోని సమస్యలను తెలుసుకున్నారు. బీజేపీ అభ్యర్థిని గెలిపిస్తే సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. చదువుకున్న యువకుడైన వీరన్నకు అవకాశం కల్పించామని, గ్రామ అభివృద్ధి కోసం యువత ఆలోచించి, కత్తెర గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు.

# కౌకొండ సర్పంచ్ బరిలో బీటెక్ విద్యార్థిని మౌనిక



అక్షరదర్బార్, పరకాల: కౌకొండ సర్పంచ్ పదవికి బీటెక్ విద్యార్థిని చుక్క మౌనిక నవీన్ పోటీ చేస్తున్నారు. గ్రామంలో డబ్బు, మద్యం రాజకీయాలను ముగించి నిజమైన అభివృద్ధికి నాంది పలకాలని ఆమె సంకల్పం వ్యక్తం చేశారు. 60 ఏళ్లుగా పరిపాలన ఉన్నా కౌకొండలో రోడ్లు, బస్సు సౌకర్యం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గ్రంథాలయం వంటి సౌకర్యాలు లేకపోవడం బాధాకరమని మౌనిక విమర్శించారు. చదువుకున్న యువత రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందని ఆమె అన్నారు. ఉంగరం గుర్తు (సీరియల్ నం. 1)పై ఓటు వేసి తనను గెలిపించాలని గ్రామ ప్రజలను ఆమె అభ్యర్థించారు.

# 300 మంది పోలీసుల బందోబస్తు

### ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సీఐ మల్లేష్ సూచన

మొగుళ్ళపల్లి, అక్షర దర్బార్: సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికల బందోబస్తు కోసం మొగుళ్ళపల్లి మండలంలో ఒక డీఎస్పీతో పాటు 300 మంది పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు చిట్యాల సీఐ మల్లేష్ తెలిపారు. బుధవారం మొగుళ్ళపల్లి పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ నారాయణ నాయక్, సీఐ మల్లేష్, ఎస్సై అశోక్ కలిసి పోలీసు సిబ్బందికి బందోబస్తు విధులకు సంబంధించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ నారాయణ నాయక్ మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మొగుళ్ళపల్లి, చిట్యాల, టేకుమట్ల ఎస్సైలు బి. అశోక్, శ్రవణ్ కుమార్, సుధాకర్, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ గెలుపుతోనే గ్రామాభివృద్ధి: మొలుగూరి బిక్షపతి

### కామరెడ్డిపల్లిలో అనితకు మద్దతుగా ఇంటింటి ప్రచారం



అక్షరదర్బార్, పరకాల: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిస్తేనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి బిక్షపతి అన్నారు. బుధవారం కామరెడ్డిపల్లిలో కాంగ్రెస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి చిర్ర అనిత రాజయ్య తరపున ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఫుట్‌బాల్ గుర్తుకు ఓటు వేసి అనితను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ప్రజాపాలన లక్ష్యంగా కృషి చేస్తున్నారని, కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే గ్రామాలు పురోగతి సాధిస్తాయని పేర్కొన్నారు. అనితను "మీ ఇంటి ఆడబిడ్డ"గా భావించి విజయం అందించాలని బిక్షపతి కోరారు. ఈ ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తడి చెత్త నుంచి ఎరువు

**- తయారీని ప్రోత్సహించాలన్న బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్**

**- 39,40 డివిజన్లలో తడి పొడి చెత్త అందజేత పరిశీలన**

అక్షరదర్బార్, వరంగల్: నగర వాసులకు తడి చెత్త నుంచి ఎరువు తయారీని ప్రోత్స హించాల్సిన అవసరం ఉందని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. క్షేత్ర స్థాయి శానిటేషన్ పరిశీలనలో భాగంగా కమిషనర్ 39, 40 డివిజన్లలో ప్రత్యక్షంగా పరిశీలించి తడి పొడి చెత్తను వేరుగా అందించడాన్ని పరిశీలించి నిర్వహణ తీరును ప్రశంసించి అన్ని డివిజన్లలో ఈ విధానాలను అవలంబించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. చెత్తను వేరుచేసి అందించడంలో భాగంగా 39వ డివిజన్ లో చెత్తను అందిస్తున్న తీరును కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రతి గడపకు వెళ్లి తడి, పొడి చెత్తను వేరుగా అందించే విధానాన్ని కమిషనర్ వివరించి మాట్లాడుతూ స్థానిక మహిళలతో పాటు వాలంటీర్లు, స్వచ్ఛ ఆటో డ్రైవర్లు సమన్వ యంతో చక్కగా తడి పొడి చెత్తను వేరుగా అందించడం అభినందనీయమని, ఇదే తరహా విధానాన్ని నగర వ్యాప్తంగా ఉన్న అన్ని డివిజన్లలో కొనసాగించేలా చూడాలని, ఈ క్రమంలో మెప్మా విభాగానికి చెందిన స్థానికంగా నివసించే పద్మ అనే మహిళ తడి చెత్తను ఉపయోగించి ఎరువు (మెన్యూర్) తయారు చేయడాన్ని పరిశీ లించిన కమిషనర్ అభినందిస్తూ పద్మను స్ఫూర్తిగా తీసుకొని గృహిణిలు తడి చెత్తను ఎరువుగా మార్చాలని, గ్రేటర్ పరిధిలో ఉన్న ప్రతి ఇంటి నుంచి తడి పొడి చెత్త వేరుగా అందించాలని, ఇందుకు సరిపోయే ట్రీట్మెంట్ ప్లాంట్ లు అందుబాటులో ఉన్నాయని, తడి పొడి చెత్తను ఇవ్వని గృహాలకు పెనాల్టీ విధించే హక్కు కార్పొరేషన్ కు ఉంటుందని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఇంట్లోకి రాకుండా చూడాలని, పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ చట్టం- 2016 ప్రకారం నగర వాసులు ప్రతి 3 సంవత్సరాలకు ఒకసారి సెప్టిక్ ట్యాంక్ ను క్లీనింగ్ చేయించుకోవాలని కమి షనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్ ఓ డా రాజారెడ్డి, ఎంహెచ్ ఓ డా రాజేష్, సానిటరీ సూపర్ వైజర్ గోల్కొండ శ్రీను, టీఎంసీ రమేష్, ఆస్కి ప్రతినిధి రాజ్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.






# బీఆర్ఎస్‌కు గ్రామశాఖ అధ్యక్షుడి రాజీనామా

**వ్యక్తిగత కారణాలతో వైదొలిగిన లక్ష్మణ్ రావు**

శాయంపేట, అక్షర దర్బార్: శాయంపేట మండలం హుస్సేన్‌పల్లి గ్రామ బీఆర్ఎస్ పార్టీలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఆ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు నాగులగాని లక్ష్మణ్ రావు బుధవారం పార్టీ సభ్యత్వానికి, పదవికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాల వల్ల బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్ష పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ఆయన ఒక ప్రక టనలో తెలిపారు. తన రాజీనామా లేఖను పార్టీ మండల బాధ్యులకు అందజేసినట్లు వెల్లడించారు.



# అభ్యర్థులకు సూచనలు

అక్షర దర్బార్ శాయంపేట : శాయంపేట మండలంలోని స్థానిక సంస్థల ఎన్నికల ఖర్చుపై పోటీ చేస్తున్న సర్పంచ్, వార్డు సభ్యులందరితో మండల కేంద్రంలో ఎంపీడీవో ఫణిచంద్ర సమావేశం నిర్వహించారు. ఈ సమావే శంలో ఎన్నికల ప్రచారంలో ఎన్నికల ఖర్చు పరిమితిపై పోటీ అభ్యర్థులకు స్పష్టమైన సూచనలు తెలియజేశారు.ఈ కార్యక్రమానికి అసిస్టెంట్ రేవతి,ఎన్ని కల వ్యయ పరిశీలకుడు ఎంపీడీవో విజయ్, ఎఫ్ ఎస్ టీ టీమ్ లీడర్, ఎంపీఒ మరియు పీఎస్ లు పాల్గొన్నారు.



# సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ

**శాంతియుత ఎన్నికలకు సమన్వయం అవసరం**

**భూపాలపల్లి ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్**

మొగుళ్ళపల్లి, అక్షర దర్బార్ : గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో భూపాలపల్లి ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ బుధవారం మొగుళ్ళపల్లి మండలంలోని ఇస్సిపేటలో ఉన్న సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. ఎన్నికలు శాంతియుతంగా జరిగేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయా లని ఆయన సూచించారు. ఎన్నికల నియమావళిని అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు పూర్తయ్యేందుకు అభ్యర్థులు, రాజకీయ నాయకులు, స్థానిక ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో చిట్యాల సీఐ మల్లేష్, మొగుళ్ళపల్లి ఎస్సై బి. అశోక్ పాల్గొన్నారు.



# సర్పంచ్ స్థానంలో హోరాహోరీ

- **ఒకే పార్టీలో, ఒకే సామాజిక వర్గంలో తీవ్ర పోటీ**
- **ఆసక్తి రేపుతున్న నడికూడ గ్రామ పంచాయతీ ఎన్నికలు**

అక్షరదర్బార్, పరకాల: పంచాయతీ ఎన్నికలను పురస్కరించు కొని హనుమకొండ జిల్లాలో మండల కేంద్రమైన నడికూడ గ్రామ పంచాయతీలో సర్పంచ్ అభ్యర్థుల మధ్య పోటీ హోరా హోరీగా సాగుతోంది. మూడో విడత ఈనెల 17న నడికూడ గ్రామపంచాయతీ సర్పంచ్, వార్డ్ మెంబర్ల స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. పోలింగ్ గడువు సమీపిస్తున్నడంతో పంచాయతీ ఎన్నికల ప్రచారం వేడెక్కిన తరుణంలో ఒకే పార్టీలో ఇద్దరు, అలాగే ఒకే సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు అభ్యర్థులు బరిలో నిలవడం వల్ల రాజకీయ సమీకరణాలు ఆస క్తికరంగా మారాయి. బీఆర్ఎస్ నుంచి ఇక్కడ సర్పంచ్ పదవికి పోటీ చేయాలని ఇద్దరు నేతలు ఆశించారు. చివరకు బీఆర్ఎస్ పార్టీ మద్దతు గోనెల శరత్‌కు లభించింది. దీంతో భంగపడిన అదే పార్టీలో మండల అధ్యక్షుడిగా పనిచేస్తున్న దూరిశెట్టి చంద్రమౌళి నడికూడ సర్పంచ్ పదవికి రెబల్ అభ్యర్థిగా రంగంలోకి దిగారు. గత ఎన్నికల్లో కూడా రెబల్‌గా పోటీ చేసి తక్కువ తేడాతో ఓటమి చెందిన చంద్రమౌళికి గ్రామస్థుల్లో కొంత సానుభూతి ఉండే అవకాశముందని స్థానికులు పేర్కొం టున్నారు. శరత్‌కు బీఆర్ఎస్ కీలక నాయకుల మద్దతు ఉండటం ఆయనకు బలంగా మారింది. ఈ ఇద్దరిలో ఒక్కరే పోటీలో ఉంటే బీఆర్ఎస్‌కు విజయం దక్కేదనే అభిప్రాయం గ్రామంలో వినిపిస్తోంది.

**ఎన్నికలు రసవత్తరం**

ఇక మరోవైపు, ఒకే సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు ప్రత్యర్థుల పోటీ కూడా సెల్‌ఫోన్ చర్చల్లో హాట్‌టాపిక్ అయింది. కాంగ్రెస్ నేతగా పనిచేసి అనంతరం బీజేపీలో చేరిన ఎండిగ రాజేశ్వరరావు బీజేపీ మద్దతుతో బరిలో నిలవగా, అదే సామాజిక వర్గానికి చెందిన కుడ్లే మల్లహల్ రావు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. వీరిద్దరి పోటీ ఫలితంగా వీరి సామాజిక వర్గం ఓట్లు చీలే అవకాశం కనబడుతోంది. ఒకరు




తప్పుకుంటే తమ వర్గానికి చెందిన అభ్యర్థే సర్పంచ్ కుర్చీలో కూర్చుంటారని వారి అనుచరులు నమ్ముతున్నారు. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ మూడు పార్టీల అభ్యర్థులు తలపడుతున్న ఈ ఎన్నికల్లో ఎవరికీ ఆధిక్యం ఉందో స్పష్టంగా చెప్పలేని పరిస్థితి నెలకొంది. బరిలో ఉన్న అభ్యర్థులు బలం, బలహీనతలు, గ్రామంలోని స్థానిక సమీకరణాలు చివరి నిమిషంలో ప్రకంప నలు రేపే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తు న్నారు. మొత్తానికి నడికూడ గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవి ఏ పార్టీ ఖాతాలో జమ అవుతుందోనని గ్రామస్తులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

# వరంగల్‌లో రైతు సంఘాల జాతీయ మహాసభలు జయప్రదం చేయండి

**వ్యవసాయ రక్షణకు బలమైన రైతు సంఘం నిర్మాణం అవసరం**

**సత్నాం సింగ్ అజ్నాల**

వరంగల్, అక్షర దర్బార్: వచ్చే ఏడాది మే 12, 13, 14 తేదీలలో వరంగల్‌లో జరగనున్న ఆలిండియా కిసాన్ కోఆర్డినే షన్ కమిటీ యూనిటీ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐకేఎఫ్ నేత కామ్రేడ్ సత్నాం సింగ్ అజ్నాల పిలు పునిచ్చారు. దేశవ్యాప్తంగా వ్యవసాయ రంగాన్ని దెబ్బతీస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో బలమైన రైతు సంఘం నిర్మాణం కోసం ఈ ఏకీకరణ మహాసభ జరుగుతోందని ఆయన తెలిపారు. ఈ సభకు 15 రాష్ట్రాల నుంచి 200 మంది ప్రతినిధులు హాజరవు తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన కీలక డిమాండ్లు చేశారు. ఒకే రైతు విధానం ఉండాలని, ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని సవరించి ఒక్క రైతుకు 7.5 ఎకరాల వ్యవసాయ భూమి మాత్రమే ఉండేలా చూడాలని అన్నారు. 60 ఏళ్లు నిండిన ప్రతి రైతుకు నెలకు రూ. 10,000 పెన్షన్ ఇవ్వాలని, అలాగే దేశవ్యాప్తంగా నదులను అనుసంధానం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం తీసుకొచ్చిన కరెంట్ బిల్లు, సైడ్ బిల్లు 2017ను రద్దు చేయాలని, భూసేకరణ చట్టానికి విరుద్ధంగా రోడ్ల కోసం రైతుల భూములను గుంజుకోవడం ఆపాలని




కేంద్రాన్ని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగంలో సుమారు 20% భాగస్వామ్యం ఉన్నప్పటికీ, బడ్జెట్‌లో కనీసం 5 శాతం కూడా కేటాయించడం లేదని కామ్రేడ్ అనుభవ్ దాస్ శాస్త్రి విమర్శించారు. రైతాంగాన్ని కార్పొరేట్ల కబ్జా నుండి రక్షించా లని, ఆదివాసీ ప్రాంతాల్లో సహజ వనరుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఉద్యమాలు నిర్మిస్తామని తెలిపారు.

# మొదటి విడత పంచాయితీ పోలింగ్‌కు కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు

**స్వేచ్ఛ, నిష్పక్షపాతంగా శాంతియుతంగా ఎన్నికల నిర్వహణే లక్ష్యం**

**జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్ ఐపీఎస్**

అక్షర దర్బార్/ ములుగు జిల్లా ప్రతినిధి: గ్రామ పంచాయతీ మొదటి విడత పోలింగ్ సందర్భంగా కట్టు దిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశామని ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్ ఐపీఎస్ అన్నారు. ములుగు జిల్లా పరిధిలో జరగబోయే మొదటి విడత గ్రామ పంచాయితీ ఎన్నికలు శాంతియుతంగా, నిష్ప క్షపాతంగా సాగేందుకు విస్తృతమైన పోలీస్ బందోబస్త్ ఏర్పాటు, ఎన్నికల ప్రక్రియ సజావుగా కొనసాగేందుకు అవసరమైన అన్ని భద్రతా చర్యలు తీసుకున్నామని తెలిపారు. కంట్రోల్ రూమ్, క్విక్ రెస్పాన్స్ టీమ్స్, సమస్య త్మక పోలింగ్ కేంద్రాల వద్ద స్ట్రైకింగ్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌లు సిద్ధంగా ఉన్నాయని, పోలీస్ పికెట్‌లు, మొబైల్ ప్యాట్రోలింగ్ ఏర్పాటు చేశాం అని తెలిపారు. గుంపులుగా తిరగడం, గొడ



వలకు, బెదిరింపులకు, దాడులకు పాల్పడడం, డబ్బు, మద్యం, బహుమతుల పంపిణీ, ఓటర్లను ప్రభావితం చేసే చర్యలకి పాల్పడడం నిబంధనలకు విరుద్ధం, ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు శాంతియుతంగా, ధైర్యంగా స్వేచ్ఛయుత వాతావరణం లో తమ ఓటు హక్కు విని యోగించుటకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ఎన్నికలను విజయవం తంగా నిర్వహించడంలో ప్రతి పోలీస్ అధికారి సమన్వ యంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.

# ఇద్దరు మావోయిస్టుల సరెండర్

అక్షరదర్బార్, ములుగు : ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ ఎదుట బుధవారం ఇద్దరు మహిళా మావోయిస్టులు లొంగిపోయారు. మడకం మల్లి, ఒయం రామే వీరిలో ఉన్నారు. వీరిద్దరూ సీపీఐ (మావోయిస్టు) పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ, డీవీసీఎం ఆకాశ్ టీంలో పనిచేసినట్లు ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ వెల్లడించారు. ఛత్తీస్ గడ్ రాష్ట్రంలోని సుక్మ, బీజాపూర్ జిల్లాలకు చెందిన మడకం మల్లి, ఒయం రామేకు రూ.25 వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని ఎస్పీ అందజేశారు. పోరు కన్నా ఊరు మిన్న- మన ఊరికి తిరిగి రండి అనే అవగాహన కార్యక్రమం ప్రభావంతో పాటు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పునరావాస పథకాలను తెలుసుకొని ప్రశాంత జీవితం గడపాలనే ఉద్దేశంతో మావోయిస్టు పార్టీకి చెందిన ఈ ఇద్దరు మహిళ సభ్యులు లొంగిపోయినట్లు ఆయన తెలిపారు. ములుగు జిల్లాలో గత జనవరి నుంచి ఇప్పటివరకు 87 మంది మావోయిస్టు పార్టీ సభ్యులు స్వచ్ఛందంగా జనజీవన స్రవంతిలో కలిసినట్లు ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ తెలిపారు.



# రేపే ఓట్ల పండుగ



## ఉమ్మడి జిల్లాలో పంచాయతీ ఎన్నికల కోలాహలం

- వలస వెళ్లిన వారంతా ఓటేసేందుకు స్వస్థలాలకు..
- మొదటి విడత పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి
- బ్యాలెట్ బాక్సులతో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది
- ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఓటింగ్
- మధ్యాహ్నం 2 గంటల తర్వాత ఓట్ల లెక్కింపు.. ఫలితాల వెల్లడి
- ఉప సర్పంచ్ ఎన్నిక కూడా..

అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి: ఉమ్మడి వరంగల్ జిల్లాలో రేపే మొదటి పంచాయతీ ఎన్నికలు జరుగనున్నాయి. ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభం కానున్నది. మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ కేంద్రంలో ఉన్నవారికి ఓటు వేసే అవకాశం ఉంటుంది. పోలింగ్ నేపథ్యంలో బుధవారం సాయంత్రమే పోలింగ్ అధికారులు, సిబ్బంది బ్యాలెట్ బాక్సులు, పత్రాలు, సామాగ్రితో ప్రత్యేక వాహనాల్లో తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. మొదటి విడతలో గురువారం భూపాలపల్లి జిల్లాలో నాలుగు మండలాలు, హనుమకొండ జిల్లాలో మూడు మండలాలు, జనగామ జిల్లాలోని ఐదు మండలాలు, మహబూబాబాద్ జిల్లాలోని ఐదు మండలాలు, ములుగు జిల్లాలోని మూడు మండలాలు, వరంగల్ జిల్లాలోని మూడు మండలాల్లో ఎన్నికలు జరుగనున్నాయి. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. పల్లెవీడిన వారంతా ఓటు వేసేందుకు ఇక మళ్లీ స్వస్థలాలకు చేరుకుంటున్నారు.

### - గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి చాలు

ఓటు హక్కు వినియోగించుకునేందుకు వెళ్లే ఓటర్లు తమ వెంట ఓటర్ కార్డు, ఆధార్ కార్డు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ జాబ్ కార్డు, ఫొటోతో కూడిన పోస్ట్ ఆఫీస్/ బ్యాంక్ పాస్ బుక్, కార్మిక మంత్రిత్వ శాఖ హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డ్, ఫొటోతో కూడిన ఎస్సీ/ ఎస్టీ/ బీసీ కుల ధృవీకరణ పత్రాలు, ఇండియన్ పాస్పోర్ట్, ఫొటోతో కూడిన పెన్షన్ డాక్యుమెంట్, కేంద్ర/ రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగ గుర్తింపు కార్డు, ఎంపీ/ఎమ్మెల్యే/ఎమ్మెల్సీల అధికారిక గుర్తింపు కార్డు, దివ్యాంగుల గుర్తింపు కార్డు, పట్టాదార్ పాస్ పుస్తకం, రేషన్ కార్డు, ఫొటోతో కూడిన ఆయుధ లైసెన్స్ పత్రం, ఫ్రీడం ఫైటర్ ఐడీ కార్డ్, లేదా ఆర్జీఐ జారీ చేసిన ఎన్పీ ఆర్ స్మార్ట్ కార్డుల్లో.. ఇలా మొత్తం 18 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి వెంట తీసుకెళ్లవచ్చు.

### - మహబూబాబాద్ జిల్లాలో

కేసముద్రం, ఇనుగుర్తి, నెల్లికుదురు, గూడూరు, మహబూబాబాద్ మండలాల్లోని 146 గ్రామ పంచాయతీలు, 1,072 వార్డులకు ఎన్నికలు జరుగనున్నాయి. సర్పంచ్ స్థానాలకు 468 మంది బరిలో ఉండగా, 1,072 వార్డులకు 2,391 మంది బరిలో ఉన్నారు. ఎన్నికలకు 3,812 బ్యాలెట్ బాక్సులను పోలింగ్ అధికారులకు అందజేశారు. 1621 మంది పోలింగ్ అధికారులు,1,853 మంది అదనపు పోలింగ్ అధికారులు,10 మంది మైక్రో అబ్జర్వర్లు ఎన్నికల విధులు నిర్వర్తించనున్నారు.

### - హనుమకొండ జిల్లాలో

జిల్లాలోని ఎల్కతుర్తి, భీమదేవరపల్లి, కమలాపూర్ మండలాల్లో మొదటి విడత ఎన్నికలు జరగనున్నాయి. ఎల్కతుర్తి మండలంలో 20 గ్రామ పంచాయతీల్లో రెండు గ్రామాలు ఏకగ్రీవమయ్యాయి. మిగతా 18 గ్రామపంచాయితీలకు ఎన్నికలు జరుగనున్నాయి. బరిలో 68 మంది సర్పంచ్ అభ్యర్థులు బరిలో ఉన్నారు.186 వార్డులకు 48 ఏకగ్రీవం కాగా 138 వార్డులకు ఎన్నికలు జరుగన ున్నాయి. భీమదేవరపల్లి మండలంలో 25 గ్రామాల్లో ఒకటి ఏకగ్రీవం కాగా, మిగతా 24 గ్రామాలకు ఎన్నికలు జరుగనున్నాయి. 89 మంది సర్పంచ్ అభ్యర్థులు బరిలో 282 వార్డులకు 425 వార్డు సభ్యులు అభ్యర్థుల బరిలోఉన్నారు. కమలాపూర్ మండలంలో 24 గ్రామపంచాయితీలు ఉండగా ఒక గ్రామం ఏకగ్రీవం అయింది. మిగతా 23 గ్రామాలకు ఎన్నికలు జరుగనున్నాయి. మొత్తం109 మంది సర్పంచ్ అభ్యర్థులు బరిలో ఉన్నారు. 246 వార్డులకు 45 ఏకగ్రీవం కాగా, మిగతా 201 వార్డులకు 554 మంది బరిలో ఉన్నారు.

### - జనగామ జిల్లాలో

జిల్లాలోని చిల్పూర్, స్టేషన్ ఘనపూర్, రఘునాథపల్లి, జాఫర్ ఘడ్, లింగాలఘనపురం మండలాల్లో మొదటి విడుత పోలింగ్ జరుగనుంది. మొత్తం 110 గ్రామ పంచాయతీలకు గాను 10 సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మిగతా స్థానాల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. అలాగే 1,024 వార్డు మెంబర్లకు 796 వార్డు మెంబర్లకు ఎన్నికలు జరుగనున్నాయి. 228 వార్డు మెంబర్లు ఏకగ్రీ వమయ్యాయి.

### - వరంగల్ జిల్లాలో..

జిల్లాలో మొదటి విడత వర్ధన్నపేట రాయపర్తి పర్వతగిరి మండలా ల్లోని 85 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్, 731 వార్డు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.

### - ములుగు జిల్లా జిల్లాలో

జిల్లాలోని ఏటూరునాగారం, గోవిందరావుపేట, తాడ్వాయి మండ లాల్లోని 48 గ్రామపంచాయతీల్లో మొదటి విడత ఎన్నికలు జరుగన ున్నాయి. డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను కలెక్టర్లు సందర్శించి పోలింగ్ అధికారులు, సిబ్బందికి బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామాగ్రి పంపిణీ పరిశీలించారు. సమస్యాత్మక గ్రామాలను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు

### - భూపాలపల్లి జిల్లాలో

జిల్లాలోని గణపురం, రేగొండ, గోరికొత్తపల్లి, మొగుళ్లపల్లి మండలా ల్లోని 82 గ్రామపంచాయతీల్లో 9 ఏకగ్రీవం కాగా మిగిలిన 73 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. 259 మంది పోటీలో ఉన్నారు. 712 వార్డు స్థానాలకు 1282 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు.

---

## ఎంతైనా పర్లే..
# గెల్సుడే లెక్క!



- పల్లె పల్లెనా ప్రలోబాల పర్వం
- తెల్లవారితే మొదటి విడత పోలింగ్
- నిన్నమొన్నటివరకు ప్రచారానికి దూరంగా ఉన్నవారు కూడ రంగంలోకి..
- ఎస్సీ, ఎస్టీ రిజర్వ్ స్థానాల్లో ఓటుకు రూ.500 వరకు పంపిణీ
- జనరల్ స్థానాల్లో రూ.వెయ్యి నుంచి గరిష్ఠంగా రూ. 3 వేల వరకు..
- వలస వెళ్లిన వారికి అభ్యర్థుల ఆఫర్లు
- ఏరులై పారుతున్న మద్యం.. ఇంటింటికీ క్వార్లర్లు
- ఇదే సరైన సమయమని భావించి బ్రాండెడ్ మద్యం కోరుతున్న మద్యం ప్రియులు

అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి : ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గురువారం మొదటి విడత పంచాయతీ ఎన్నికలు జరుగనున్నాయి. తెల్లవారే సరికి పోలింగ్ మొదలు కానుండటంతో సర్పంచ్ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులు, వార్డు స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకుకునేందుకు చిట్టచివరి అస్త్రాన్ని ప్రయోగిస్తున్నారు. ప్రలోభాలకు తెరతీశారు. నిన్నమొన్నటి వరకు మనకెందుకులే..అ నుకున్నవారు ఇప్పుడు తగ్గేదేలే.. అంటూ రంగంలోకి దిగుతున్నారు. బస్తీ మే సవాల్.. అంటూ, ఇజ్జత్ కే సవాల్ అంటూ.. అప్పో సప్పో చేసి డబ్బు పంచుతున్నారు. ఎలాగైనా ఎన్నికల్లో గెలవాలని సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. క్రితంసారి సర్పంచ్‌గా పనిచేసిన వారికి బిల్లులు రాక ఇబ్బంది పడ్డారని, కొందరు అప్పుల పాలయ్యారని.. వెనుకాడిన వారే ఇప్పుడు, గెలవాలని సంకల్పించుకుని ఓట్లు రాబట్టేందుకు డబ్బు పంచుతున్నారు. పంచాయతీ ఎన్నికల తర్వాత జరిగే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే వారుకూడా, పంచాయతీ ఎన్నికల్లోనే పోటీ చేసేందుకు బరిలోకి దిగడం గమనార్హం. కొందరైతే ఎన్నికలను స్టేటస్‌గా భావించి బరిలో కి దిగారు.

### - వలస వెళ్లిన వారికి ఆఫర్లు

తెల్లవారితే పోలింగ్ ప్రారంభం కానుండంతో అభ్యర్థులు తన అనుచరులు, సన్నిహితుల ద్వారా గ్రామాల్లో డబ్బు పంపిణీకి తెరలే పుతున్నారు. బతుకుదెరువుకు వలస వెళ్లినవారు వచ్చి ఓటు వేసేందుకు అన్ని ఖర్చులు వారే పెట్టుకుంటామంటున్నారు. ఇప్పటికే బయల్దేరని వారిని వెంటనే బయల్దేరమని పురమాయిస్తున్నారు. ఎంత ఖర్చయినా ఫర్వా లేదని రమ్మంటున్నారు. కొందరు అభ్యర్థుల ైతే ఏకంగా ప్రత్యేక వాహనాలు తీసుకున్ని గ్రామానికి ఆహ్వానిస్తు న్నారు. వచ్చిన తర్వాత ఇంట్లో ఎన్ని ఓట్లు ఉంటే, అంత మొత్తంలో సొమ్ము ఇస్తామని, వెహికల్ కిరాయి కూడా పెట్టుకుంటామని బేరాలు కుదుర్చుకుంటున్నారు.

### - ఓటుకు 300 నుంచి 3 వేలు

ఎస్సీ, ఎస్టీలకు రిజర్వ్ అయిన స్థానాల్లో అభ్యర్థులు ఒక్కో ఓటరుకు రూ.300 నుంచి రూ.500 వరకు ఖర్చు చేస్తున్నారు. ఇక బీసీ, జనరల్‌కు రిజర్వ్ అయిన స్థానాల్లోనైతే ఓటుకు రూ.వెయ్యి నుంచి రూ.3 వేలకు గరిష్ఠంగా అభ్యర్థులు పంచుతున్నారు. పోటి ఉత్కంఠ భరితంగా ఉన్న సర్పంచ్ స్థానాల్లో మొదట ఓ అభ్యర్థి ఓటుకు రూ.1500 ఇస్తే ఆ తర్వాత మరో అభ్యర్థి రూ.2000 చొప్పున, అనంతరం మొదట రూ.1500 చొప్పున ఇచ్చిన అభ్యర్థి మరోసారి అదనంగా ఇంకో రూ.500 నుంచి రూ.1000 వరకు ఇస్తున్నారు. ఎక్కువ ఓట్లు ఉన్నచోటయితే అభ్యర్థులు ఎంత ఖర్చుకైనా వెనుకాడటం లేదు. జనరల్ స్థానాల్లో అత్యధికంగా డబ్బు పంపిణీ అవుతున్నట్లు ప్రచారం జరుగుతున్నది.

### - వరదలై పారుతున్న మద్యం

మామూలుగానే ఎన్నికల హడావుడి ప్రారంభం కాగానే మద్యం చలామణి ఎక్కువగా ఉంటుంది. అభ్యర్థులు ఎన్నికల ప్రచారం ప్రారంభించిన నాటి నుంచే వందల కాటన్ల మద్యాన్ని పంపిణీ చేశారు. మొదటి విడత పోలింగ్ చేరువైన సమయంలో ఇప్పుడు గ్రామాల్లో మద్యం పంపిణీ తారస్థాయికి చేరింది. ఇదే సదవకాశం అన్నట్లు.. మద్యం ప్రియులు తాము కోరిన మద్యం బ్రాండ్స్ ఇవ్వాలంటూ కోరుతున్నారు. అంతకముందు సాదాసీదా మద్యం తాగిన వారు కూడా ఇప్పుడు కాస్ట్లీ మందు కావాలను కోరుతున్నారని చెప్తున్నారు. మామూలుగా గ్రామాల్లో మద్యం ప్రియులు ఒక 180 మి.లీ క్వార్టర్ కు రూ.100 నుంచి గరిష్ఠంగా రూ.200 వరకు ఖర్చు చేస్తారు కానీ, ఇప్పుడు అభ్యర్థులు ఎలాగైనా ఓటర్లు రాబట్టేందుకు రూ.200 క్వార్టర్ కంటే ఎక్కువ ఉండే బ్రాండ్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిసింది. కొన్ని చోట్ల మద్యంతో పాటు అభ్యర్థులు కిలో గోధుమ పిండి, కిలో కోడి కూరకూడా పంపిణీ చేస్తున్నారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.

వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజు మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915